సాక్షి కామారెడ్డి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



పిల్లలను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని డీఈవో రాజు సూచించారు.

- 8లో ▸



ఘనత కేసీఆర్‌దే..

ఉద్యోగులను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని బీజేపీ నేత వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /21.0

వాతావరణం

వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'వంతెన నిర్మాణానికి త్వరలో టెండర్'



నిజాంసాగర్: సింగితం వాగుపై వంతెన నిర్మాణానికి త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామని ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ఎస్‌ఈ ప్రభాకర్ తెలిపారు. శనివారం సింగితం గ్రామ శివారులోని వాగును ఆయన పరిశీలించారు. వాగుపైన వంతెన నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం రూ. 4.8 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ సురేశ్ తదితరులున్నారు.

కౌలాస్ నాలా ప్రాజెక్టు నీటి విడుదల

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి శనివారం 1,388 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా శనివారం సాయంత్రానికి 457.75 మీటర్ల(1.176 టీఎంసీ) నీరుందన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక



కామారెడ్డి అర్బన్: సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా వ్యవసాయ శాఖకు చెందిన ఉద్యోగి కే.శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్ర యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో శ్రీనివాస్‌రెడ్డి సత్తా చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయనకు ఏఈవోలు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

తొమ్మిది చోట్ల ప్రదర్శన



కామారెడ్డి క్రైం: జిల్లాలోని తొమ్మిది థియేటర్లలో గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామని, శనివారం 30 పాఠశాలలకు చెందిన 4,571 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు దీనిని తిలకించారని కలెక్టర్ తెలిపారు. బాల్యం నుంచే విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు గాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం చిత్ర ప్రదర్శన ఉండదని తెలిపారు. 21 నుంచి 24 వరకు థియేటర్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్రాన్ని ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, పౌరులు కూడా చూడవచ్చని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఏపీపీగా నంద రమేశ్



కామారెడ్డి క్రైం: రాష్ట్రస్థాయి ఉత్తమ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జిల్లా కోర్టు ఏపీపీ నంద రమేశ్ ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎంపిక చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనరసయ్య ఏపీపీ నంద రమేశ్‌కు ప్రశంస పత్రాన్ని అందించారు. ఆయనను తోటి ఏపీపీలు, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీపీలు అశోక్ కుమార్, దామోదర్‌రెడ్డి శేషు, వర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిరుతపులి సంచారం

పెద్దకొడప్‌గల్: పోచారం గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం చిరుతపులి సంచరించింది. పశువుల కాపరి ప్రశాంత్ చెట్టుపై నుంచి చిరుతను ఫొటో తీశాడని గ్రామస్తులు తెలిపారు. అటవీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

రాజసం ఉట్టిపడేలా..

కట్టిపడేసే ఆకృతి.. ఉట్టిపడే రాజసంతో 'థార్' వెహికిల్ ఆకట్టుకుంటోంది. ఇది మధ్యతరగతి నుంచి సంపన్న వర్గాల వరకు అందరి మనసూ దోచుకుంటోంది. 'థార్'పై సవారీకి చాలామంది ఆసక్తి చూపుతుండడంతో జిల్లాలోనూ ఈ వాహనాల సంఖ్య పెరుగుతోంది. జిల్లా రోడ్లపై రయ్యిరయ్యిమంటూ దూసుకుపోతున్న 'థార్'పై సండే స్పెషల్..

సండే స్పెషల్

- 'థార్'పై సవారీకి పెరుగుతున్న క్రేజ్
- నాయకుల కాన్వాయ్‌లోనూ ఈ వాహనాల జోరు
- ధర ఎక్కువైనా వెనక్కి తగ్గని కొనుగోలుదారులు
- జిల్లా రోడ్లపై దూసుకుపోతున్న వాహనాలు



సాక్షి, కామారెడ్డి: కరోనా వ్యాప్తి తర్వాత చాలామంది కార్ల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లాలో కార్ల సంఖ్య పెరుగుతోంది. ఆర్థికశక్తి కూడా పెరగడంతో లగ్జరీ కార్ల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. మహీంద్ర కంపెనీ తయారు చేసిన 'థార్' మోడల్‌కు చాలామంది ఫిదా అవుతున్నారు. రాజకీయ నాయకులు తమ కాన్వాయ్‌లో థార్‌లు ఉంచుకుంటున్నారు. వ్యాపారులూ ఈ వాహనంపై మనసు పారేసుకుంటున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో రాణించిన వాళ్లు హుందాతనం కోసం థార్ మీద సవారీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కొందరైతే రెండు, మూడు వాహనాలు కొనుగోలు చేశారు. దీంతో 'థార్' వాహనాలు జిల్లా రోడ్లపై రయ్యిమంటూ పరుగులు తీస్తున్నాయి.

లాంగ్ డ్రైవ్‌కు అనుకూలం..

చాలామంది లాంగ్ డ్రైవ్‌కోసం థార్‌ను ఎంచుకుంటున్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఈ వాహనంలో విహార యాత్రలకు వెళ్లివస్తున్నారు. కూర్చునేందుకు అనువుగా సీట్ల అమరిక ఉండడంతో ఇందులో ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. ధరతోపాటు మెయింటెనెన్స్ ఖర్చు కాస్త ఎక్కువే అయినా థార్‌ను కలిగి ఉండడాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తుండడంతో జిల్లాలో వాహనాల సంఖ్య పెరిగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వందకుపైగా థార్‌లు ఉన్నట్లు తెలుస్తోంది.

హుందాగా ఉంటుంది..



థార్‌లో వెళ్తే ఎంతో హుందాగా ఉంటుంది. ఎటైనా ఇదే వాహనంలో వెళ్తున్నా. మట్టి రోడ్లపై ప్రయాణించినా, గుట్టల మీదికి వెళ్లినా సౌకర్యవంతంగా ఉంటుంది. లాంగ్ డ్రైవ్ కోసం కూడా ఉపయోగపడుతుంది.

– సురేందర్‌రెడ్డి, కామారెడ్డి

పార్ట్‌నర్స్‌తో కలిసి..

వ్యాపార భాగస్వాములం కలిసి థార్‌ను కొనుగోలు చేశాం. ఇటీవల ఫ్యామిలీతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చాను. ఫ్యామిలీతో వెళ్లడానికి ఈ వాహనం బాగుంటుంది. ఎంత ఎత్తు ప్రదేశమైనా ఎక్కడానికి ఉపయోగపడుతుంది.

– రాజు పాటిల్, దేవునిపల్లి, కామారెడ్డి





ఎటు వెళ్లాలన్నా..

థార్ వాహనం బాగుందని నేను కొనుగోలు చేశాను. కుటుంబ సభ్యులతో కలిసి ఎటు వెళ్లాలన్నా ఇందులోనే ప్రయాణిస్తున్నాం. సేఫ్ జర్నీకి ఇలాంటి వాహన అవసరం.

– భీంరెడ్డి, తిప్పాపూర్, భిక్కనూరు మండలం

ఆకట్టుకునేలా..



థార్ మోడల్ చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించడానికి ఉపయోగపడుతుంది. స్నేహితులతో కలిసి లాంగ్ డ్రైవ్ చేయడానికి అనుకూలంగా ఉంది. రెగ్యులర్‌గా ఇందులోనే తిరుగుతున్నాం.

– పత్తి శ్రీనివాస్, పిట్లం

సౌకర్యవంతంగా ఉంటుంది



మహీంద్ర థార్ మోడల్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కుటుంబంతో కలిసి ఎలాంటి రోడ్ల పైనైనా ప్రయాణించడానికి ఈ వాహనం సౌకర్యంగా ఉంటుంది.

– అంజద్‌ఖాన్, సీతాయిపల్లి, గాంధారి మండలం

థార్ కొనాలన్నది నా కల



థార్ మోడల్ చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. చిన్న ఫ్యామిలీ ప్రయాణించడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ మోడల్‌ను కొనాలన్నది నా కల. దానిని నెరవేర్చుకున్నాను. కుటుంబంతో కలిసి దూర ప్రాంతాలకూ ఇందులోనే వెళ్తా.

– సిద్ధి శ్రీధర్, ఎల్లారెడ్డి

పిల్లలూ ఇష్టపడతారు



నేను హైదరాబాద్‌లో ఉంటాను. పదిపదిహేను రోజులకు ఒకసారి స్వగ్రామం బిచ్కుందకు వస్తుంటా. ఇక్కడ వ్యవసాయ పనులు చూసుకుని తిరిగి వెళ్తా. ఫ్యామిలీతో కలిసి వచ్చి వెళ్తుంటాం. ఇందులో ప్రయాణాన్ని పిల్లలూ ఎంజాయ్ చేస్తారు.

– నాలం శ్రీధర్, బిచ్కుంద

అందరి సంక్షేమానికి కృషి

బాన్సువాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాడ్కోల్‌లో మజీద్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అందరినీ కలుపుకుని ఇటు మందిరాలు, అటు మజీదులు, చర్చిలు, గురుద్వారాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఆచరణకు వీలుకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడానికి సరిపడా బడ్జెట్ లేక చేతులెత్తేసిందన్నారు. మజీద్ ప్రహరీ నిర్మాణానికి రూ. 10 లక్షలతో పాటు గ్రామంలో ఆశీర్‌ఖానా నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని, దాల్మల్‌కుచ్చలో ఖబర్‌స్థాన్ కోసం స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు 40 వరకు మజీద్‌లను నిర్మించిన దాత అబ్రార్ సహాబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, శ్రీధర్, మోహన్ నాయక్, పాతబాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, గంగారాం, భూషణ్‌రెడ్డి, కుమ్మరి రాజు, ముస్లిం మతపెద్దలు సమీఉల్లా, మౌలానా రఫీక్, అజ్మత్, హఫీజ్ వవాబ్, ఘనీ, మహ్మద్ ఎజాస్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సీఎం కేసీఆర్ ఏది చేసినా చరిత్రే

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- అర్హులకు బీసీ బంధు పంపిణీ

పిట్లం: ముఖ్యమంత్రి కేసీఆర్ ఏది చేసినా చరిత్రేనని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టి ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. శనివారం పిట్లంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 300 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఇదే జుక్కల్ నియోజకవర్గంలో పుట్టి పెరిగానని, ఇక్కడే ఉద్యోగం చేశానని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు ఏం కావాలో తెలుసన్నారు. తాను ఎమ్మెల్యే కాక ముందు నియోజకవర్గంలో 100 గ్రామాలకు బీటీ రోడ్డు లేదన్నారు. తాను ఎమ్మెల్యేనయ్యాక 90 గ్రామాలకు రోడ్డు వేయించానన్నారు. మిగిలిన గ్రామాలకూ తారు రోడ్డు మంజూరైందని తెలిపారు. బిచ్కుంద, జుక్కల్, పిట్లంలకు సెంట్రల్ లైటింగ్ మంజూరయ్యిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే హన్మంత్ సింధే

మద్యం దందాపై పెరిగిన మోజు!

- వైన్ షాపులకు భారీగా దరఖాస్తులు
- రేపు లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు

సాక్షి, కామారెడ్డి: మద్యం దందాలో అధిక లాభాలు వస్తాయని, మనీ రొటేషన్ అవుతుందన్న ఉద్దేశంతో చాలామంది వైన్‌షాప్‌ల కోసం పోటీపడ్డారు. మార్కెట్‌లో రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో స్థబ్దత నెలకొని వ్యాపారాలు సాగడం లేదు. ప్రభుత్వానికి సంబంధించిన కాంట్రాక్టు పనులు చేసిన వాటికి బిల్లులు సకాలంలో రాకపోవడం కూ డా రియల్టర్లు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు చాలా మంది మద్యం వ్యాపారంపై దృష్టి సారించారు. దీంతో ఈసారి భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. వాటిద్వారా సర్కారుకు భారీగా ఆదాయం సమకూరింది.

జిల్లాలో 49 మద్యం దుకాణాలుండగా 2,174 దరఖాస్తులు వచ్చాయి. నిజాంసాగర్‌లోని వైన్ షాపునకు అత్యధికంగా 88, తాడ్వాయి దుకాణానికి 86 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా మద్దెలచెరువు దుకాణానికి రెండు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. 18 దుకాణాలకు యాభైకిపైగా అప్లికేషన్లు రావడం గమనార్హం. జిల్లాలో నిజాంసాగర్, తాడ్వాయితో పాటు రాజంపేట మండల కేంద్రాలలో కూడా పోటీ ఎక్కువగా ఉంది. కామారెడ్డి, నాగిరెడ్డిపేట, రామారెడ్డి, భిక్కనూరు, బీర్కూర్, బిచ్కుంద, పద్మాజీవాడి, పిట్లం, దోమకొండ మండల కేంద్రాల్లో భారీగానే దరఖాస్తులు వచ్చాయి. అతి తక్కువ దరఖాస్తులు వచ్చిన మద్దెల చెరువు దుకాణం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారి సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి తెలిపారు.



డ్రాకు ఏర్పాట్లు..

మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో లాటరీ నిర్వహించేందుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం లక్కీ డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. సిరిసిల్ల రోడ్డులోని రేణుక ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాలకు డ్రా తీయనున్నారు. అదృష్ట దేవత ఎవరిని కరుణిస్తుందోనని దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

జిల్లాలో మద్యం దుకాణాలవారీగా నమోదైన దరఖాస్తుల వివరాలు..

గ్రామం	దుకాణం నంబర్	దరఖాస్తులు									
నిజాంసాగర్	39	88	బిచ్కుంద	41	55	దోమకొండ	17	46	మాచారెడ్డి	11	31
తాడ్వాయి	23	86	కామారెడ్డి	03	54	కామారెడ్డి	08	45	మద్నూర్	45	31
రాజంపేట	22	72	పద్మాజీవాడి	14	54	సదాశివనగర్	13	45	బాన్సువాడ	33	29
కామారెడ్డి	04	63	కామారెడ్డి	01	53	కామారెడ్డి	05	44	నస్రుల్లాబాద్	37	29
నాగిరెడ్డిపేట	30	62	భిక్కనూరు	19	52	లింగంపేట	27	43	బాన్సువాడ	35	28
రామారెడ్డి	10	58	పిట్లం	46	52	ఎల్పుగొండ	15	42	బాన్సువాడ	32	28
భిక్కనూరు	18	58	పిట్లం	47	51	లింగంపేట	26	38	బాన్సువాడ	31	27
కామారెడ్డి	07	58	దోమకొండ	16	49	గాంధారి	28	36	బీబీపేట	20	25
బీర్కూర్	36	57	ఎల్లారెడ్డి	25	49	మాచారెడ్డి	12	36	మద్నూర్	44	25
కామారెడ్డి	06	57	గాంధారి	29	48	బాన్సువాడ	34	35	దుర్కి	38	22
కామారెడ్డి	09	56	కామారెడ్డి	02	48	బీబీపేట	21	33	పెద్దకొడప్‌గల్	49	15
			బిచ్కుంద	40	47	జుక్కల్	43	33	మద్దెలచెరువు	48	02
			ఎల్లారెడ్డి	24	47	జుక్కల్	32	32			

మైనారిటీల జీవితాలలో వెలుగులు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- ముస్లింలకు రూ. లక్ష సాయం పంపిణీ

కామారెడ్డి క్రైం: మైనారిటీల జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో 75 మంది మైనారిటీలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయంతో చిన్నచిన్న వ్యాపారాలు చేసి ఆర్థికంగా బలోపేతమవ్వాలని సూచించారు. పేద మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. త్వరలో మైనారిటీ మహిళలకు 300 కుట్టు మిషన్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్థిక సాయాన్ని మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, అదనపు కలెక్టర్ మను చౌదరి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, ఇన్‌చార్జి మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వరరావు, ఎంపీపీ ఆంజనేయులు, మాచారెడ్డి జెడ్పీటీసీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేస్తున్న గంప గోవర్ధన్

పంచాయతీ కార్యదర్శులకు..

పంచాయతీ కార్యదర్శులపై మరింత బాధ్యత పెరిగిందని గంప గోవర్ధన్ పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రెగ్యులర్ అయిన పంచాయతీ కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోని 70 మందికి రెగ్యులరైజ్‌కు సంబంధించిన నియామక పత్రాలు అందించారు.



నియామక పత్రాలు అందిస్తున్న గంప గోవర్ధన్

ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- జిల్లాకేంద్రంలో 5 కే రన్

కామారెడ్డి క్రైం: పటిష్టమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు వజ్రాయుధంలాంటిదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి కళాభారతి వరకు 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అంశంపై 5 కే రన్ నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాలలో 5 కే రన్ నిర్వహించామన్నారు. ఓ వైపు వర్షం పడుతున్నా ఎంతో ఉత్సాహంతో యువత పరుగులో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈవీఎంల ద్వారా ఎలా ఓటు వేయాలో తెలియజేసేందుకు వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీలలో పోలింగ్ బూత్ స్థాయిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వద్ద ముసాయిదా ఓటరు జాబితా అందుబాటులో ఉంటుందని, 18 ఏళ్లు నిండినవారు అందులో తమ పేరుందో లేదో సరిచూసుకుని మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, డీఎల్‌పీవో సాయిబాబా, తహసీల్దార్ సాయిలు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కోర్టు తీర్పులపై అవగాహన



ఖలీల్‌వాడి : తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. వైట్ కాలర్ నేరాలు ఎలక్ట్రిసిటీ చట్టాల గురించి కేసుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహిమోద్దీన్, రాజేష్ గౌడ్, అశోక్ శివరాం నాయక్, డాక్టర్ సమ్మయ్య వివరించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య న్యాయసలహాలు తెలిపి, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులపై అవగహన కల్పించారు. రాష్ట్రంలోనే అత్యధిక కేసులలో శిక్షపడేటట్లు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రవిరాజ్, కవితారెడ్డి, నంద రమేష్, డాక్టర్ సమ్మయ్య అభినందించారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు



ఖలీల్‌వాడి : ప్రస్తుతం ఎక్కువమందికి గుండెపోటు అధికంగా వస్తున్నాయని సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చునని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టు బిల్డింగ్‌లో కోర్టు ఉద్యోగులకు సీపీఆర్ శిక్షణ కార్యక్రమంపై నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగహన కలిగి ఉంటే ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డాక్టర్ వెంకటేష్, కోర్టు సిబ్బంది తతదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

రాజంపేట : యువతి అదృశ్యమైన సంఘటన రాజంపేట మండలం అన్నారం తండాలో చోటు చేసుకుంది. ఏఎస్సై తెలిపిన గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. అన్నారం తండాకు చెందిన మెగావత్ బుజ్జి కూతురు లావణ్య(19) ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. తల్లి మెగావత్ బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు.

'పెట్టుబడి' పేరిట మోసం

- అధిక లాభాల ఆశతో మోసపోతున్న యువత
- పరువుకు భయపడి ఫిర్యాదులు చేయని వైనం
- డోలె యాప్‌లో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన పలువురు
- తర్వాత కంగుతిన్న బాధితులు



గూగుల్ ప్లేస్టోర్‌లో కనిపిస్తున్న డోలె యాప్



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ చిరు ప్రైవేటు ఉద్యోగి తన పైసా పైసా జమ చేసి రూ. లక్ష పోగు చేసుకున్నాడు. అయితే పలువురు మిత్రులు 'డోలె' పేరుతో ఉన్న యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని చెప్పడంతో భార్య, తల్లికి తెలియకుండా పెట్టుబడి పెట్టాడు. వారానికి రూ.5 వేల చొప్పున రూ.4 లక్షల వరకు వస్తాయన్న ఆశతో పెట్టాడు. కాని రూ.10 వేలు మాత్రమే వచ్చాయి. డబ్బులు ఏమయ్యాయని తల్లి అడగడంతో నిత్యం వాళ్ల ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి.

మరి కొన్ని ఘటనలలో..

మండల కేంద్రానికి చెందిన ఓ మొబైల్ షాపు వ్యాపారి రూ.2 లక్షలు, సైకిల్ షాపు వ్యాపారి రూ.4 లక్షలు, చికెన్ సెంటర్ వ్యాపారి రూ.6 లక్షలు పెట్టి మోసపోయినట్లు సమాచారం. వ్యాపారులు మొదట రూ.10 వేల లోపు పెట్టుబడి పెట్టారు. డబ్బు తిరిగి రావడంతో మళ్లీ పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టారు. దీనితో డబ్బులు తిరిగి రాకపోవడంతో ఒక్కసారిగా నష్టపోయారు. సైబర్ మోసగాళ్లు పేట్రేగి పోతున్నారని వారిని నమ్మి మోసపోవద్దు అని నిత్యం అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా యువత వారికి బానిసలుగా మారుతున్నారు. దీనితో ప్రతి రోజు ఏదో ఒక రకంగా డబ్బులు నష్టపోతున్నారు.

సోషల్ మీడియా వేదికగా..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాలను హ్యాక్ చేసి తమకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉందంటూ అడుగుతున్నారు. కామారెడ్డి జిల్లాలో ఓ ఎమ్మెల్యే పేరున, బాన్సువాడలో ఓ జిల్లా ప్రజాప్రతినిధి పీఏ పేరున డబ్బులు అడిగిన ఘటనలున్నాయి. బాన్సువాడ పట్టణంలో సైతం ఓ ఉపాధ్యాయుడి డబ్బులు కాజేసిన ఘటనలు ఉన్నాయి. వీటి నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలుమార్లు అవగాహన కల్పిస్తున్నా కూడా చదువుకున్న యువత ఊబిలో పడుతున్నారు.

వెంటనే సమాచారమివ్వాలి

లోన్ యాప్, బిజినెస్ పెట్టుబడి యాప్‌లను నమ్మవద్దని పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక వేళ తమ అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయితే వెంటనే తమకు సమాచారం అందిస్తే అకౌంట్‌ను ఫ్రీజ్ చేయడంతో పాటు తమ డబ్బులను ఇప్పించే ప్రయత్నం చేస్తామని ధైర్యం కల్పించినా కూడా పరువు పోతుందని బయట పడటం లేదు.

ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు

యువత ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన విషయం మా దృష్టికి రాలేదు. ఆన్‌లైన్ మోసాలపై పలుమార్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. సైబర్ మోసాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే ఫలితం ఉంటుంది.

– అబీద్ బేగ్, ఏఎస్సై, నస్రుల్లాబాద్

పిల్లల్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

జిల్లా విద్యా శాఖాధికారి రాజు



దోమకొండలో మాట్లాడుతున్న అధికారి రాజు

దోమకొండ: తల్లిదండ్రులు, తమ పిల్లల ప్రయత్నాలను ప్రోత్సహించాలని డీఈవో రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. తల్లితండ్రుల ప్రవర్తనను వారు గమనిస్తారన్నారు. కలిసి భోజనం చేయడం, ఆటలాడటం, ఇంటి పనుల్లో కలిసి ఉండటం వంటి పనులను కుటుంబసమేతంగా చేయాలన్నారు. గౌరవప్రదమైన భాషతో మాట్లాడాలని, కఠినంగా మాట్లాడవద్దని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు శ్రీపతి, ఎంఈవో ఎల్లయ్య, పాఠశాల ప్రిన్సిపల్ లిలియానా, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



కామారెడ్డి రూరల్: లింగాపూర్‌లో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస మొదటి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సాయంత్రం ఇస్కాన్ కామారెడ్డి వారి ఆధ్వర్యంలో హరి నామ సత్సంగం, గ్రామ సంకీర్తన, భజన సంకీర్తనలు, భగవత్ గీత ప్రవచనాలు, సామూహిక హనుమాన్ చాలీసాపారాయణము, మహా హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, బండారి యాదవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బోర్లంలో..

బాన్సువాడ రూరల్: బోర్లంలోని ఆది బసవేశ్వర ఆలయంలో శ్రావణమాస శనివాసం సందర్భంగా ఆలయ పీఠాధిపతి సద్గురు సోమలింగ శివాచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన, అఘోర పాతుపత హోమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కమతాల శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని కలిసిన జ్ఞానేశ్వరి



కామారెడ్డి టౌన్: జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు డిసౌజాను శనివారం ఢిల్లీలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డిలో ఆదివారం మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ మండల కో–ఆప్షన్ ఇర్షాదొద్దిన్ తెలిపారు. కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల పోటాపోటీ ఆందోళనలు

- పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు



మాచారెడ్డి పీఎస్ ఎదుట బైఠాయించిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ శ్రేణులు

మాచారెడ్డి: మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శనివారం పోటాపోటీగా ఆందోళనలు నిర్వహించారు. రోడ్డెక్కి గంటపాటు రాస్తారోకో చేశారు. ఈ నెల 15న మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ జన్మదినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పూల రాజు, ఎంపీపీ నర్సింగరావ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడం వివాదానికి కారణమైంది. దీనికి సంబంధించి శుక్రవారం రాత్రి రాజును నిలదీయడంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు తమపై దాడి చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. విద్యుత్తు సరఫరా నిలిపివేసి కాంగ్రెస్ కార్యకర్త పూల రాజు ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ నాయకులు చితకబాది హత్యా ప్రయత్నం చేశారని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో కూర్చుని మాట్లాడుకుంటే సరిపోతుందని, అలా కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇనుపరాడ్లు, కర్రలతో దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన అనంతరం రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు కూడా రాస్తారోకో చేసి, తమ నాయకుడిపై అసభ్యపదజాలంతో దూషించిన పూల రాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తోన్న బీఆర్ఎస్ శ్రేణులు

బట్వాడా చేయని ఉత్తరాలు స్వాధీనం

- పోస్టుమన్‌పై శాఖాపరమైన చర్యలు
- ఉత్తరాలు సోమవారం నుంచి బట్వాడా



ఉత్తరాలను బస్తాల్లో తరలిస్తున్న సిబ్బంది

కామారెడ్డి అర్బన్ : ఉత్తరాలు బట్వాడా చేయని కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసు పోస్టుమన్ జే సీతారామారావుపై బాధితులు ఫిర్యాదు చేయడం, పత్రికల్లో రావడంతో పోస్టల్ ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేఖ, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వేణు పోస్ట్‌మెన్ సీతారామారావు అడ్రస్ కనిపెట్టారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ, వీధి నం.5లో ఉంటున్న గదికి అధికారులు చేరుకుని దాదాపు వెయ్యికి పైగా బట్వాడా చేయని రిజిస్టర్, సాధారణ ఉత్తరాలను పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో సీతారామారావు ఇంట్లోనే ఉన్నారు. ఉత్తరాలను ఇతర పోస్టమన్లతో బట్వాడా చేయిస్తామని ప్రజలు ఆందోళన చెందవద్దని, సీతారామారావుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి పోస్ట్‌మాస్టర్ రాజు తెలిపారు.

5కే రన్‌కు అపూర్వ స్పందన



ఎల్లారెడ్డిలో 5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు



బిచ్కుందలో..

బిచ్కుంద/ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో, బిచ్కుంద మండల కేంద్రంలో అధికారులు శనివారం 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మోడల్ స్కూల్ వరకు, బిచ్కుంద మండల కేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. రన్‌కు అపూర్వ స్పందన లభించింది. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, జాబితాలో పేరు లేనివారు పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్ తండా శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు లింగంపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు.. రాంపూర్ గడ్డకు చెందిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో దస్తగిరి రమేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హైదరాబాదుకు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



విష్ణువర్ధన్ (ఫైల్)

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఎమ్మాజి విష్ణువర్ధన్ (32) శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తో పాటు మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణువర్ధన్ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్నాడు. శుక్రవారం తండ్రి ఎమ్మాజి గంగాధర్ (బీడీ టేకేదార్)తో కలిసి విష్ణువర్ధన్ నిజామాబాద్‌లోని బీడీ కంపెనీకి వెళ్లాడు. అనంతరం తండ్రిని గ్రామానికి పంపించేసి తాను కులాస్‌పూర్‌కు వెళ్లివస్తానని చెప్పాడు. రాత్రి 10.30 గంటలకు తాను ఇంటికి వస్తున్నట్లు తండ్రికి ఫోన్‌లో తెలిపాడు. కాని ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే ముల్లంగి (బి) గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయాన్నే ముల్లంగి(బి) గ్రామంలోని ఓ ఇంటి ఎదుట మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు బైక్‌నంబర్ ఆధారంగా పాఠశాల యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన మృతుడి కుటుంబీకులకు తెలుపడంతో హుటాహుటిన వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదేళ్ల కుమారుడున్నాడు. గ్రామంలోని సీసీపుటేజీలో ప్రమాద దృశ్యాలు నమోదయ్యాయి.

చేపల వేటకు వెళ్లి యువకుడు..



భాస్కర్(ఫైల్)

బాన్సువాడ రూరల్ : మండలంలోని జక్కల్‌దాని తండా చెందిన ముడావత్ భాస్కర్(28) అనే యువకుడు బోర్లం తోర చెరువులో చేపల వేటకు వెళ్లి నీటమునిగి మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. జక్కల్‌దాని తండాకు చెందిన భాస్కర్ మద్యానికి బానిసై పనిపాట లేకుండా తిరిగేవాడని, కొంత కాలంగా భార్య అనుష, పిల్లలతో కలిసి ఉపాధికోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారన్నారు. ఈనెల 16న తండ్రి చందర్‌ను చూడటానికి తండాకు వచ్చిన భాస్కర్ రాత్రి అందరు పడుకున్న తర్వాత ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు అందరూ వెతకగా బోర్లం చెరువుపై దుస్తులు పడి ఉండడాన్ని గమనించి విచారించగా మృతదేహం లభించిందని, అది భాస్కర్‌దిగా కుటుంబీకులు గుర్తించారన్నారు. చేపల వేటకోసం వెళ్లి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు..



దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో రెండు గొర్రెలు, మేక మృతి చెందినట్లు గొర్రెల యజమాని స్వామి తెలిపారు. శనివారం మధ్యాహ్నం వర్షం తగ్గగానే గ్రామ శివారులో మేతకు వెళ్లగా సెల్‌ఫోన్ టవర్ వద్ద రెండు గొర్రెలు, మేక విద్యుత్ షాక్‌కు గురై మరణించాయన్నారు. వాటి విలువ సుమారు రూ. 40 వేల వరకు ఉంటుందన్నారు. అధికారులు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద పేకాట ఆడుతున్న స్థావరంపై శనివారం సాయంత్రం స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారు. బొగ్గుగుడిసె చౌరస్తాలోని మడిగెలో పేకాట ఆడుతున్న గ్రామాలకు చెందిన 10 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 15 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ రూరల్ సీఐ మురళి తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిపైన కేసు నమోదు చేసి రిమాండ్ చేశామన్నారు.

ఇంటిస్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి : నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్‌కాలనీలో ఇంటిస్థలాన్ని ఆక్రమించుకున్నారని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణ ఇంటిస్థలం పక్కనే ఉన్న కమలమ్మతోపాటు కుమారులు, మరికొందరు తన ప్లాట్‌లోకి అక్రమంగా ప్రవేశించి గదిని కూల్చివేసి నాగప్రతిమను పెట్టినట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కమలమ్మతో పాటు కుమారులను ప్రశ్నించగా వారు దాడిచేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వైన్ షాపులో చోరీ



భిక్కనూరు : మండల కేంద్రంలోని ఒక వైన్ షాప్ షట్టర్‌ను పైకిలేపి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 10 మద్యం సీసాలను శనివారం వేకువజామున అపహరించుకువెళ్లారు. మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర వైన్స్ షాపు తాళం కప్పలను తొలగించి దొంగలు షట్టర్‌ను పైకి లేపి లోనికి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్ ఉన్న రూ. 5వేల నగదు అపహరించుకుని వెళ్లారు. షాప్ నిర్వాహకుడు మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు అమ్ముతామని సైబర్ మోసం

- అప్రమత్తతతో తప్పిన ఆర్థిక నష్టం

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : ఫేస్‌బుక్‌లో రూ. 80 వేలకే ఈకో కారు అమ్ముతామని పెట్టిన ఫోటోలకు స్పందించిన ఒకరు ఆ తర్వాత భారీ ఆర్థికనష్టం నుంచి బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. రామారెడ్డి మండలం గిద్ద గ్రామానికి చెందిన కాస్తూరి మధుసూదన్ ఫేస్‌బుక్‌లో ఈకో కారు రూ. 80వేలకే అమ్ముతామని పేర్కొంటు నంబర్లతో కూడిన ప్రకటన చూసి స్పందించారు. ఈనెల 12న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కారును రూ.80వేలకే అమ్ముతామని ముందుస్తుగా బుక్ చేసుకోవాలనుకుంటే రూ. 3వేలు 84865 10272నంబర్‌కు ఫోన్‌పే పంపాలని పేర్కొనగా మధుసూదన్ రూ. 3 వేలు పంపారు. మరోమారు ఈనెల 13న మరోవ్యక్తి ఫోన్‌చేసి మీ కారు కార్గోలో పంపుతున్నామని రూ. 11,500 పంపాలని పేర్కొనడంతో మధుసూదన్ తాను మోసపోయానని గుర్తించి వెంటనే 1930కు ఫోన్ చేసి సైబర్‌మోసంపై ఫిర్యాదు చేశారు. వారు వెంటనే సదరు నంబర్‌కు వెళ్లిన రూ. 3వేలను హోల్డ్‌లో పెట్టారు. దీనిపై మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



మాట్లాడుతున్న ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ) : ఏర్గట్ల మండలం తొర్తిలో గంజాయి విక్రయించడానికి వచ్చిన కోరుట్లకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు గంజాయిని తీసుకొచ్చి విక్రయించే ప్రయత్నంలో కాపుకాసి పట్టుకున్నామన్నారు. విక్రేతల నుంచి ఒక బైక్‌తో పాటు 160 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్ర శివారులో జాతీయ రహదారి 44 పై ఆగి ఉన్న డీసీఎం వ్యానును లారీ ఢీకొట్టింది. శనివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. బొప్పాయికాయల లోడ్‌తో ఆర్మూర్‌నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మండల కేంద్ర శివారుకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో రహదారిపై నిలిపిఉంచారు. అదే మార్గం నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి డీసీఎం వ్యానును బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎం వ్యాను బోల్తాపడింది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. లారీ డ్రైవర్ రాంసింగ్‌కు కాలు విరిగింది. బాల్కొండ పోలీసులు వెంటనే డీసీఎం వ్యాన్‌ను, లారీని రహదారిపై నుంచి తొలిగించారు.

గతేదాది ఇక్కడే..

గతేదాది జూలై మాసంలో శనివారం ఎక్కడైతే ప్రమాదం జరిగిందో అక్కడే ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదం కూడా ఆర్మూర్‌నుంచి వస్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో లారీని రోడ్డుపై నిలిపిఉంచగా ఆర్మూర్ వైపు నుంచి వస్తున్న కంటెయినర్ ఢీకొట్టింది. ఆ సమయంలో టైర్ మార్చుతున్న కంటెయినర్ డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందారు.

మృతదేహం నుంచి పర్సు, ఏటీఎం కార్డుల చోరీ

ఖలీల్‌వాడి : నగరంలోని 1వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో మోహన్ అనే వ్యక్తి మృతి చెందగా అతడి వద్ద ఉన్న పర్సు, ఏటీఎం కార్డు, భూమి పత్రాలు చోరీ జరిగినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్రానికి చెందిన మోహన్ గుండెపోటు రావడంతో అతన్ని నగరంలోని మనోరమ ఆస్పత్రికి తీసుకొచ్చారని, వైద్యులు పరిశీలించి అప్పటికే ఆయన మరణించినట్లు పేర్కొన్నారన్నారు. అయితే ఆస్పత్రికి వచ్చిన తర్వాత మోహన్ జేబులో ఉన్న పర్సు, ఏటీఎం కార్డులు, భూమి పత్రాలను ఎవరో దొంగలించినట్లు ఆయన కుమారుడు దీపక్ ఫిర్యాదు చేశారన్నారు. జులై 25న ఏటీఎం కార్డు నుండి రూ. 31 వేలు డ్రా చేసినట్లు చెప్పారు. దీపక్ ఫిర్యాదు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.